పంటపొలంలో వ్యక్తి మృతదేహం

గోవూర్‌కు చెందిన పోచయ్యగా గుర్తించిన పోలీసులు

శక్కర్‌నగర్, అక్టోబర్ 8: బోధన్ పట్టణ శివారులోని పసుపువాగు పక్కనే ఉన్న పంటపొలంలో ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పంట పొలాలకు వెళ్లిన రైతులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ సీఐ వెంకట నారాయణ, సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని బోధన్ జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కాగా, మృతుడి జేబులో లభ్యమైన ఆధార్ కార్డు ఆధారంగా గోవూర్‌కు చెందిన కె.పోచయ్య (58)గా గుర్తించారు. గతంతో వీఆర్‌ఏగా విధులు నిర్వహించిన పోచయ్య ప్రస్తుతం బోధన్ మున్సిపల్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. రెండు రోజుల క్రితం పోచయ్య గోవూర్‌కు వెళ్తానని చెప్పడంతో ఆయన బంధువులు బోధన్ నుంచి ఆటోలో పంపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

బోధన్ రూరల్, అక్టోబర్ 8: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి మంగళవారం మద్యంమత్తులో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బోధన్ రూరల్ ఎస్సై మశ్చేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మేకల నాగేశ్ (40) వ్యవసాయం చేసుకునేవాడు. నష్టం రావడంతో మద్యానికి బానిసయ్యాడు. అప్పులు ఎక్కువకావడంతో మద్యం మత్తులో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య తోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృత్యుడి భార్య జయశ్రీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాహనం ఢీకొని బాలుడు మృతి

భీమ్‌గల్, అక్టోబర్ 8: వాహనం ఢీకొని బాలుడు మృతి చెందిన ఘటన మంగళవారం పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్సై మహేశ్ కథనం ప్రకారం.. టాటాఏస్ వాహనం భీమ్‌ఘల్ నుంచి సిరికొండ వెళ్తోంది. డ్రైవర్ మహ్మద్ అఫ్రోజ్ అతి వేగంగా తన వాహనాన్ని నడుపుతూ రోడ్డు దాటుతున్న నందిగల్లీకి చెందిన తోపారం నిశ్వంత్(7)ను ఢీకొట్టాడు. గాయాలపాలైన బాలుడిని ఆర్మూర్ దవాఖానకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. బాలుడి తల్లి తోపారం వనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దాబాలో భోజనం చేసేందుకు వెళ్లి..

శక్కర్‌నగర్, అక్టోబర్ 8: బోధన్ పట్టణంలోని రైతు దాబాలో అన్నం తినేందుకు వెళ్లిన ఓ వ్యక్తి మృతి చెందాడు. బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ కథనం మేరకు.. దూపల్లి బాలయ్య (40) ఈనెల 7న సాయంత్రం తన భార్యకు చెప్పి బయటికి వెళ్లాడు. తన స్నేహితులు గూండ్ల సాయి కుమార్, ద్యాకం శ్రీకాంత్‌తో కలిసి మద్యం సేవించాడు. భోజనం చేసేందుకు పట్టణ శివారులోని రైతు దాబాకు వెళ్లారు. అన్నం తినే క్రమంలో దూపల్లి బాలయ్య స్పృహ తప్పి పడిపోయాడు. అతన్ని చికిత్స నిమిత్తం బోధన్ జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి సోదరుడు దూపల్లి గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ తెలిపారు.

మద్యం మత్తులో డయల్ 100కు కాల్

యువకుడిపై కేసు నమోదు .. రెండు రోజుల జైలు శిక్ష

వినాయక్‌నగర్, అక్టోబర్ 8: మద్యం మత్తులో డయల్ 100 నంబర్‌కు కాల్ చేసి మిస్‌యూజ్ చేసిన యువకుడికి న్యాయస్థానం రెండు రోజుల జైలు శిక్ష విధించింది. నగరంలోని గౌతంనగర్‌కు చెందిన కర్క పట్ల రాజేశ్ అనే యువకుడు ఈ నెల 7న మద్యం మత్తులో డయల్ 100 నంబర్‌కు అనవసరంగా కాల్ చేసి, పోలీసుల సమయాన్ని వృథా చేశాడు. దీంతో మూడో టౌన్ ఎస్సై మహేశ్ సదరు యువకుడిపై కేసు నమోదు చేసి మంగళవారం కోర్టులో హాజరుపర్చారు. న్యాయస్థానం యువకుడికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది.

మత్స్యకారుల అభ్యున్నతికి సర్కారు కృషి

బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

అశోక్‌సాగర్ చెరువులో చేపపిల్లలను వదులుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

ఎడపల్లి, అక్టోబర్ 8: మత్స్యకారుల అభ్యున్నతికి సర్కారు కృషి చేస్తోందని బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం జాన్కంపేట్‌లోని అశోక్‌సాగర్ చెరువులో చేపపిల్లలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుతో కలిసి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మత్స్య అభివృద్ధి పథకం కింద వంద శాతం సబ్సిడీపై చెరువులు, రిజర్వాయర్లు, కుంటల్లో చేప పిల్లలను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. చేప పిల్లల సైజు, నాణ్యతను పరిశీలించి చెరువుల్లో విడుదల చేసుకోవాలని మత్స్యకారులకు సూచించారు. అశోక్‌సాగర్ చెరువులో మొత్తం 57,300 చేప పిల్లలు విడుదల చేయగా అందులో బొచ్చ రకం 22,920, రోహం రకం 28,650, బంగారు జాతికి చెందిన చేప పిల్లలు 5730 ఉన్నాయని ఎమ్మెల్యే వివరించారు. ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా 2.27 కోట్ల చేప పిల్లలు చెరువుల్లో వదలనున్నట్లు తెలిపారు. వీటిని విడుతల వారీగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అశోక్‌సాగర్ చెరువు చుట్టూ ఇనుప కంచె ఏర్పాటుకు కృషి చేస్తానని, వివిధ చెరువుల్లో చేపల పెంపకానికి అవరోధంగా మారిన గుర్రపు డెక్కను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, ట్రైనీ కలెక్టర్ సంకేత్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, మత్స్య శాఖ జిల్లా అధికారి ఆంజనేయ స్వామి, నాయకులు పాల్గొన్నారు.

13 నుంచి కాజీపేట-దాదర్ రైలు

వినాయక్‌నగర్,అక్టోంబర్ 8: ఈ నెల 13 నుంచి కాజీపేట-దాదర్ రైలు పరుగులు తీయనున్నది. అయోధ్య ప్రయాణికుల కోసం తొమ్మిది నెలల క్రితం రద్దు చేయబడిన కాజీపేట-దాదర్ రైలును మళ్లీ ప్రారంభించనున్నారు. ఈ రైలు నడపాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, అధికారులకు ఎంపీ అర్వింద్ పలుమార్లు విన్నవించగా.. ఈ నెల 13 నుంచి రైలును నడపనున్నారు. దీంతో నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ఆర్మూర్, నిజామాబాద్ ప్రాంతాల నుంచి ముంబైకి వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు తొలగనున్నాయి.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మాక్లూర్, అక్టోబర్ 8 : మండలంలోని దాస్‌నగర్‌లో మంగళవారం పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మంచిర్యాల జిల్లా నుంచి దాస్‌నగర్‌లోని రైస్‌మిల్‌కు డీసీఎం వ్యాన్‌లో వస్తున్న బియ్యాన్ని సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. డీసీఎం డ్రైవర్ పరారీలో ఉన్నాడని తెలిపారు. సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం అందించామని, రీసైక్లింగ్ కోసం బియ్యాన్ని తీసుకువచ్చినట్లు ఆయన అనుమానం వ్యక్తం చేశారు.

అనాథలకు ఇల్లు మంజూరు చేయించాలి

శక్కర్‌నగర్, అక్టోబర్ 8: బోధన్ పట్టణంలో కరోనా సమయంలో దంపతులు మృతి చెందగా వారి కుమారులు అనాథలుగా మారారని, వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేయించాలని కోరుతూ మంగళవారం బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతోకు వినతిపత్రం అందజేశారు. తల్లిదండ్రులు మృతి చెందిన నాటి నుంచి పిల్లలు వారి చిన్నమ్మ వద్దే ఉంటున్నారని, వారికి ఆశ్రయం కల్పించాలని కోరుతూ బోధన్ పట్టణానికి చెందిన సోషల్ వర్కర్ సనాపటేల్ సబ్ కలెక్టర్‌కు అనాథ పిల్లలతో వినతిపత్రం ఇప్పించారు.

ఆయిల్‌పామ్ తోటలు సాగు చేయాలి

తిమ్మాపూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మోర్తాడ్, అక్టోబర్ 8: రైతులు ఆయిల్ పామ్ పంట సాగు చేస్తే లాభాలు వస్తాయని ఉద్యానశాఖ అధికారులు అన్నారు. తిమ్మాపూర్ గ్రామంలోని ఆయిల్‌పామ్ తోటలో మంగళవారం కీటకాల ద్వారా పరపరాగ సంపర్కం చేసే విధానంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. మోర్తాడ్ క్లస్టర్ ఉద్యాన అధికారి రాజు గౌడ్, ప్రెనిక్యూ ఆయిల్‌పామ్ కంపెనీ డీజీఎం, ఏరియా మేనేజర్ రోహిత్, ప్రేమ్‌సింగ్ రైతులకు కుంట నరేశ్ రైతులకు వివరించారు. పంట సాగు చేసి మూడేండ్లు అవుతున్నదని, వచ్చే సంవత్సరం పంట కోతకు వస్తుందని అన్నారు. కీటకాల ద్వారా పరపరాగ సంపర్కం చేయిస్తే అధిక దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. టన్ను ఆయిల్ పామ్ గెల ధర రూ.17వేల వరకు లభించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి ఉన్న రైతులు ఉద్యానశాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

మోర్తాడ్, అక్టోబర్ 8: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. మంగళవారం ప్రాజెక్ట్‌లోకి 21,590 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091 అడుగులు (80.5టీఎంసీలు) కాగా, ప్రాజెక్ట్‌లో 1091 అడుగులు (80.501టీఎంసీలు) నీరు నిల్వ ఉన్నది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువకు 6,800 క్యూసెక్కులు, ఎస్కేప్‌గేట్ల ద్వారా 1200 క్యూసెక్కులు, లక్ష్మీకాలువకు 150 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు, వరద కాలువకు 12వేల క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 500 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు.

ముగిసిన కబడ్డీ శిక్షణ శిబిరం

శిక్షణ పూర్తిచేసుకున్న క్రీడాకారులు

ముప్కాల్, అక్టోబర్ 8: జిల్లా స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ శిక్షణ శిబిరం మంగళవారం ముగిసిందని ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యుడు నునుగొండ అంజయ్య అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్‌రెడ్డి ప్రసంగించారు. జిల్లా నలుమూలల నుంచి 40 మంది క్రీడాకారులను ఎంపిక చేసి ఈనెల 3వ తేదీ నుంచి మంగళవారం వరకు ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియంలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ రాజ్‌కుమార్, స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు మోతె గంగారెడ్డి, టి.సాయన్న, చింతకింది ఉదయ్, కంచు నరేశ్, గోపీ రాము తదితరులు పాల్గొన్నారు.

చందూర్‌లో వర్షం.. రైతన్నకు నష్టం

చందూర్‌లో వర్షానికి నేల వాలిన పంటలను పరిశీలిస్తున్న రైతులు

చందూర్ మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో మంగళవారం వర్షం కురిసింది. ఉదయం నుంచి మేఘావృతమైన ఆకాశం ఏకధాటిగా వర్షం కురవడంతో వరి పంట దెబ్బతిన్నది. నాలుగు రోజుల్లో కోద్దామనుకున్న రైతుల ఆశలు అడియాశలయ్యాయి. చందూర్ శివారులో సుమారు 170 ఎకరాల్లో చేతికొచ్చిన వరి పంట నేల వాలిందనివ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. వర్షానికి ధాన్యం నేలపాలయ్యిందని రైతన్నలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

–చందూర్, అక్టోబర్ 8

పాతంగల్ పీహెచ్‌సీలో మందుల్లేవ్..

ఇంజక్షన్లు, సిరంజీలను బయట కొనుగోలు చేస్తున్నరోగులు

పాతంగల్, అక్టోబర్ 8 : పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాల్సిన ప్రభుత్వ దవాఖానల్లో సమస్యలు వేధిస్తున్నాయి. పాతంగల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వారం రోజులుగా మందుల కొరత ఏర్పడింది. చిన్నపాటి అనారోగ్యంతో దవాఖానకు వెళ్లినా చికిత్స అందడంలేదు. సిరంజీలు, ఇంజక్షన్లు, ఐవీసెట్స్ లేవని, బయట కొనుగోలు చేసుకోవాలని వైద్యసిబ్బంది సూచించడం గమనార్హం. దీంతో చేసేదిలేక రోగులు బయటకొనుగోలు చేయకతప్పడంలేదు. అత్యవసర సమయంలో వచ్చే రోగులకు కనీస వసతులు కూడా లేని ప్రభుత్వ దవాఖాన ఉండి ఏం లాభమంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మందుల కోసం ఇండెంట్ పంపించామని, పైనుంచి తమకు సరఫరా చేయడంలేదని దవాఖానలోని ఓ అధికారి పేర్కొన్నారు. సిరంజీలతోపాటు ఐవీసెట్స్ కూడా లేవని, రోగులు బయట కొనుగోలు చేసుకుంటున్నారని చెప్పడం గమనార్హం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మందుల కొరత లేకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వాణిజ్య

సామ్‌సంగ్ టాప్

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ సామ్‌సంగ్ మరోసారి సత్తాను చాటింది. ప్రస్తుత పండుగ సీజన్ తొలి విడుతలో కంపెనీ మొబైళ్లకు కొనుగోలుదారుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సీజన్‌లో అమ్ముడైన ఫోన్లలో 20 శాతం మార్కెట్ వాటాతో సామ్‌సంగ్ తొలిస్థానంలో నిలిచిందని టెక్ ఇన్‌సైట్స్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అలాగే సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 6 వరకు కేవలం 11 రోజుల్లోనే 10 లక్షలకు పైగా ఐఫోన్లు కొనుగోలు చేశారు. అత్యధికంగా అమ్ముడైన ఫోన్లలో గెలాక్సీ ఎం35, గెలాక్సీ ఎస్23, గెలాక్సీ ఏ14, గెలాక్సీ ఎస్23 ఎఫ్ ఈలు ఉన్నాయి. బిగ్ బిలియన్ డేస్ పేరుతో ఫ్లిప్‌కార్ట్ ప్రత్యేక ఆఫర్లు ప్రకటించగా, అమెజాన్ ఇండియన్ ఫెస్టివల్ పేరుతో ఆఫర్లను తీసుకొచ్చాయి.

టాటా టెక్నాలజీస్‌తో బీఎండబ్ల్యూ జట్టు

ముంబై, అక్టోబర్ 8: టాటా టెక్నాలజీస్, బీఎండబ్ల్యూ గ్రూప్ జట్టు కట్టాయి. మంగళవారం తమ జాయింట్ వెంచర్ (జేవీ)ను అధికారికంగా ప్రకటించాయి. బీఎండబ్ల్యూ టెక్ వర్క్స్ ఇండియా పేరిట ఈ జేవీని తెచ్చారు. సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ వెహికిల్స్ (ఎస్‌డీవీ)సహా ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్, ఐటీ వ్యాపారం కోసం డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సొల్యూషన్స్‌ను ఇది అభివృద్ధి చేయనున్నది. కాగా, 100 మంది ఉద్యోగులతో ఇది మొదలు కానున్నది. పుణె, బెంగళూరు, చెన్నై ఆధారంగా కార్యకలాపాలు సాగుతాయి.

ఎఫ్ఎంసీజీపై పామాయిల్ పిడుగు

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: అంతర్జాతీయ మార్కెట్లో భగ్గుమంటున్న పామాయిల్ ధరలు దేశీయ ఎఫ్ఎంసీజీ రంగ సంస్థల లాభాలపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపనున్నది. సెప్టెంబర్ త్రైమాసికంలో ఆయా సంస్థల లాభాలు భారీగా తగ్గే అవకాశాలున్నాయని సర్వే వెల్లడించింది. ఒకవైపు పామాయిలు ధరలు, మరోవైపు ఉత్పత్తి వ్యయం, ప్రకటనలకోసం అధికంగా నిధులు వెచ్చించడంతో మార్జిన్లు, లాభాలపై ప్రతికూల ప్రభావం పడనున్నది. గోద్రెజ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్, డాబర్, మారికోలు తమ లాభాలు ఏడాది కనిష్ఠ స్థాయికి పడిపోయే అవకాశాలున్నాయని పేర్కొన్నాయి.

హైదరాబాద్‌లో 'రియల్' డౌన్

19 శాతం తగ్గిన ఇండ్ల అమ్మకాలు దేశీయ ప్రధాన నగరాల్లోనే అత్యధికం

జూలై-సెప్టెంబర్‌లో 11,564 యూనిట్లకే పరిమితం ప్రాప్‌టైగర్ తాజా సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: రాష్ట్ర రియల్ ఎస్టేట్ మార్కెట్ మందగమనంలోకి జారుకున్నది. హైదరాబాద్‌లో వరుసగా పడిపోతున్న ఇండ్ల అమ్మకాలు దీన్నే సూచిస్తున్నాయి మరి. ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలోనూ గృహ విక్రయాలు నీరసంగానే సాగాయి. ప్రముఖ రియల్ ఎస్టేట్ బ్రోకరేజీ వేదిక ప్రాప్‌టైగర్.కామ్ మంగళవారం దేశీయ రెసిడెన్షియల్ మార్కెట్‌పై 'రియల్ ఇన్‌సైట్' పేరిట విడుదల చేసిన నివేదిక ప్రకారం.. గత నెల సెప్టెంబర్‌తో ముగిసిన 3 నెలల్లో హౌజింగ్ సేల్స్ ఏకంగా 19 శాతం దిగజారాయి. దేశంలోని 7 ప్రధాన నగరాల్లో ఇదే అత్యధికం కావడం గమనార్హం. నిరుడు జూలై-సెప్టెంబర్‌లో 14,191 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. ఈ ఏడాది ఇదే సమయంలో 11,564 యూనిట్లకే పరిమితమయ్యాయి.

బయ్యర్లలో తగ్గిన ఆసక్తి

గత ఏడాదిదాకా హైదరాబాద్‌లో పరుగులు పెట్టిన స్థిరాస్తి మార్కెట్.. ఇప్పుడు పడకేసింది. ప్రస్తుతం కొనుగోలుదారుల్లో ఇండ్లను కొనాలన్న ఆసక్తే కనిపించట్లేదని వ్యాపారులు చెప్తున్నారు. మార్కెట్‌లో నెలకొన్న ఇబ్బందికర పరిస్థితులు ఒక కారణమైతే.. రుణ లభ్యత కఠినం కావడం మరో కారణమని వారు అంటున్నారు. కాగా, పరిస్థితులు ఇలాగే సాగితే కేవలం నిర్మాణ రంగమేగాక, దాని అనుబంధ రంగాలూ సంక్షోభంలోకి జారుకుంటాయని ఇండస్ట్రీ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

హైడ్రా ఎఫెక్ట్

రాష్ట్ర రియల్ ఎస్టేట్ రంగంలో హైడ్రా ప్రకంపనల్ని సృష్టిస్తున్నది. హైదరాబాద్‌లో తెచ్చిన హైడ్రా.. ఇతర నగరాల్లోని లావాదేవీలపైనా గట్టి ప్రభావాన్నే చూపుతున్నది. ఇక రాజధాని లోనైతే హైడ్రా దెబ్బకు బయ్యర్లు.. ముఖ్యంగా ఎగువ మధ్యతరగతి వర్గాలు ఇండ్లు, ఫ్లాట్లు, ప్లాట్లు కొనాలనే ఆలోచనే వాయిదా వేసుకుంటున్నారు. దీంతో కొత్త నిర్మాణాలన్నీ ఆగిపోయాయి. ఇప్పటికే పూర్తయిన ఇండ్లనూ కొనే వారు లేకపోవడంతో పెట్టిన పెట్టుబడుల్ని రాబట్టుకోనేందుకు తక్కువ ధరలకు ఇస్తామన్నా ఆదరణే కరువైపోయింది. ఫలితంగా రియల్టర్లు ఆందోళన, ఆవేదన చెందుతున్నారు.

దేశవ్యాప్తంగా..

హైదరాబాద్‌సహా మొత్తం దేశంలోని 8 ప్రధాన నగరాల్లో ప్రాప్‌టైగర్.కామ్ తాజా సర్వే జరిగింది. ఇందులో ఢిల్లీ-ఎన్‌సీఆర్ మినహా మిగతా 7 నగరాల్లోనూ హౌజింగ్ సేల్స్ పతనమైనట్టు స్పష్టమైంది. అయితే టాప్-7 నగరాల్లో హైదరాబాద్‌లోనే అత్యధికంగా ఇండ్ల అమ్మకాలు తగ్గినట్టు తేలింది. కాగా, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో 29 శాతం విక్రయాలు పెరిగాయి. గతంతో పోల్చితే 7,800 యూనిట్ల నుంచి 10,098 యూనిట్లకు ఎగిశాయి. కోల్‌కతాలో గరిష్ఠంగా 22 శాతం క్షీణించాయి. 3,607 యూనిట్ల నుంచి 2,796 యూనిట్లకు పడిపోయాయి. ఇక బెంగళూరులో 11 శాతం, అహ్మదాబాద్‌లో 9 శాతం, చెన్నైలో 8 శాతం, పుణెలో 3 శాతం, ముంబైలో 1 శాతం చొప్పున సేల్స్ దిగజారాయి.

బీవైడీ సరికొత్త ఈవీ

సింగిల్ చార్జింగ్‌తో 530 కిలోమీటర్లు..

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: చైనాకు చెందిన ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ బీవైడీ..దేశీయ మార్కెట్లోకి మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈమ్యాక్స్ 7 రూ.26.9 లక్షల నుంచి రూ.29.9 లక్షల మధ్యలో లభించనున్నది. వీటిలో ఆరుగురు కూర్చోవడానికి వీలుండే మాడల్ ధర రూ.26.90 లక్షలు, ఏడు సీట్ల మాడల్ ధర రూ.27.50 లక్షలు, సూపరియర్ మాడల్ రూ.29.30 లక్షల నుంచి రూ.29.90 లక్షల మధ్యలో లభించనున్నది. దీంట్లో 55.4 కిలోవాట్ల బ్యాటరీ ప్రీమియం మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 420 కిలోమీటర్లు ప్రయాణించనుండగా, అలాగే 71.8 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 530 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 10.1 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 180 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. ఆటోమేటిక్ క్లైమెట్ కంట్రోల్, వైర్‌లెస్ చార్జర్, ఎయిర్ ప్యూరిఫైర్, మూడు ఎయిర్‌బ్యాగ్‌లు వంటి ఫీచర్స్ ఉన్నాయి. ఈ సందర్భంగా బీవైడీఇండియా హెడ్ రాజీవ్ చౌహాన్ మాట్లాడుతూ..దేశీయంగా ప్రవేశపెట్టిన నూతన ఈవీ పాలసీలో ప్రయోజనాలు పొందడానికి దరఖాస్తు చేసుకునే అవకాశాలు లేవని స్పష్టం చేశారు.

ఈసారి కూడా వడ్డీరేట్లు యథాతథమే!

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: ఈసారి కూడా రిజర్వుబ్యాంక్ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నాయి. దేశవ్యాప్తంగా కూరగాయల ధరలు భగ్గుమంటుండటంతో ఆహార ద్రవ్యోల్బణ సూచీ గరిష్ఠ స్థాయిలోనే నమోదవుతుండటంతో బుధవారం ప్రకటించనున్న తన పరపతి సమీక్షలో వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నాయని ఇండస్ట్రీ వర్గాలు అంచనావేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి మాత్రం వడ్డీరేట్లను అర శాతం తగ్గించేందుకు ఆస్కారం ఉన్నదని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ ఎండీ, సీఈవో ధీరజ్ రెల్లి తెలిపారు. వరుసగా పది సమీక్షలో వడ్డీరేట్లను ముట్టుకోకపోవడంతో రెపోరేటు 6.50 శాతం వద్ద కొనసాగుతున్నది. దేశ ఆర్థిక వ్యవస్థ ఆందోళనకరంగా ఉండటం, పశ్చిమ దేశాల్లో యుద్ధమేఘాలు కమ్ముకోవడంతో చమురు ధరలు భారీగా పెరిగే అవకాశం ఉన్నదని, ఈ నేపథ్యంలో వచ్చే రెండు సమీక్షల్లో ప్రస్తుత రేట్లను కొనసాగించే అవకాశాలున్నాయన్నారు. తొలి త్రైమాసికంలో వృద్ధి 7.5 శాతం సాధించింది.

హైదరాబాద్‌లో తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్

హైదరాబాద్, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ శివార్లో ప్రత్యేకంగా తైవాన్ పరిశ్రమ పరిశ్రమల కోసం ప్రత్యేకంగా ఓ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దండుమల్కాపూర్‌కు సమీపంలో ఈ పార్క్‌ను ఏర్పాటు చేయాలని నిశ్చయించారు. ఇందుకు సంబంధించి తైవాన్ చాంబర్ ఆఫ్ కామర్స్(టీసీసీ) ఉపాధ్యక్షుడు సైమన్ లీ, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి మంగళవారం టీజీఐఐసీ కార్యాలయంలో ద్వైపాక్షిక ఒప్పందంపై సంతకాలు చేశారు. దండుమల్కాపూర్ సమీపంలో ఇప్పటికే ఉన్న 600 ఎకరాల ప్రభుత్వ భూమితోపాటు మరో 400 ఎకరాలు సేకరించి మొత్తం వెయ్యి ఎకరాల్లో ఈ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది. తైవాన్ నుంచి రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ ఒప్పందం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్‌లో తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం ఇప్పటికే రూపకల్పన జరిగిందని, పెట్టుబడిదారులతో సమావేశాలు, రాష్ట్రాన్ని అంతర్జాతీయంగా ప్రమోట్ చేయడం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

హమ్మయ్య..కోలుకున్నాయి

సెన్సెక్స్ 584, నిఫ్టీ 217 పాయింట్ల లాభం • 7.5 లక్షల కోట్లు పెరిగిన మదుపరుల సంపద



ముంబై, అక్టోబర్ 8: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలకు బ్రేక్‌పడింది. వరుసగా ఆరు రోజులుగా భారీగా నష్టపోయిన సూచీలు తిరిగి కోలుకున్నాయి. బ్లూచిప్ సంస్థల షేర్లకు లభించిన మద్దతుకు తోడు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు సూచీలను ముందువైపుకు నడిపించాయి. ఇంట్రాడేలో 700 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 585 పాయింట్లు అందుకొని 81,635 పాయింట్ల వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ సైతం 217.40 పాయింట్లు ఎగబాకి తిరిగి 25 వేల మార్క్‌ను అధిగమించింది. చివరకు 25,013.15 పాయింట్ల వద్ద స్థిరపడింది. మార్కెట్లు ఉవ్వెత్తున ఎగిసిపడటంతో మదుపరుల సంపద భారీ స్థాయిలో పెరిగింది. గత ఆరు సెషన్లలో రూ.9 లక్షల కోట్లకు పైగా సంపదను కోల్పోయిన మదుపరులు ఒక మంగళవారం నాడే రూ.7 లక్షల కోట్లకు పైగా పెరగడం విశేషం. దీంతో బీఎ